భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

కంఠేశ్వర్, జనవరి 13 : భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయనున్నదని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 నుంచి ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయనున్నదని అర్హులైన కుటుంబాలకు ఏడాదికి రెండు విడుతల్లో రూ.6వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు. ఉపాధిహామీ పథకంలో కూలీలుగా నమోదై ఉండి, 2023–24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు పని చేసి, భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులని స్పష్టం చేశారు. ప్రతి జీపీలో ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామసభలల్లో లబ్ధిదారుల ముసాయిదా జాబితాను చదివి వినిపించిన తర్వాత తుది జాబితాను తయారుచేస్తామని కలెక్టర్ తెలిపారు.

కోడి పుంజు రూ.600, కోడి పెట్ట రూ.400..

కోటగిరి, జనవరి 13 : సంక్రాంతికి నాటుకోళ్లకు భలే గిరాకీ ఉంటుంది. సోమవారం కోటగిరిలో విక్రయానికి తెచ్చిన నాటు కోళ్లకు డిమాండ్ పెరిగింది. మామూలు రోజుల్లో కోడిపుంజు ధర రూ.400 పలుకగా రూ.600పైగా పలికింది. కోడిపెట్ట రూ.300 ఉండగా 400 పైగా ధర పలికింది. ధర ఎంత ఉన్నా కొనుగోలుదారులు నాటు కోళ్లను కొనేందుకు ఆసక్తి చూపారు.

'రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి'

డిచ్‌పల్లి, జనవరి 13 : కేంద్ర ప్రభుత్వం లిఖిత పూర్వకంగా రైతుకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంఎస్‌పీ గ్యారెంటీ చట్టాన్ని అమలుచేయాలని పంజాబ్‌లో రైతు నాయకుడు జగదీత్ సింగ్ దల్లేవాలా 46 రోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదన్నారు. ఆయన ప్రాణాలకు ముప్పు వాటిల్లితే కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు కృష్ణా గౌడ్, దేవస్వామి, పద్మ, బన్సీ పాల్గొన్నారు.

సంగీత ఉపాధ్యాయులుగా జిల్లావాసులు

సుభాష్‌నగర్, జనవరి 13 : సుభాష్‌నగర్ జ్ఞానసరస్వతీ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో కర్ణాటక సంగీతం విద్యాభ్యాసం చేసిన 8 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపాల్ రవీందర్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేసి, వివిధ ప్రాంతాల్లో చిన్నారులకు సంగీత నృత్య పాఠాలు నేర్పుతున్న నగ్మా, శిరీష, దివ్య, యజ్ఞ, నవీన, పూజ, సుష్మ, విజయ్ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు.

'అవి తప్పుడు ఆరోపణలు'

భీమ్‌గల్, జనవరి 13: మండలంలోని చేంగల్ గ్రామానికి చెందిన తక్కూరి నికేశ్ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసిన సెల్ఫీ వీడియోలో చెప్పిన వివరాలు తప్పుడు ఆరోపణలు అని ఎస్సై మహేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. నికేశ్ భార్య రజిని తన భర్తపై ఫిర్యాదు చేయడంతో కౌన్సెలింగ్ ఇచ్చేందుకు స్టేషన్‌కు పిలువగా తప్పించుకొని తిరుగుతున్నాడని, ఈ నెల11న కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌కు రాకుండా ఈనెల 12న సోషల్ మీడియాలో తనను పోలీసులు వేధిస్తున్నారని వీడియో పోస్టు చేశాడన్నారు. తక్కూరి నికేశ్ ఆరోపణలు నిరాధారమని, తాము ఎవరినీ వేధించడం లేదని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

తాగునీటి కోసం రోడ్కెక్కిన టాక్లీ గ్రామస్తులు

కోటగిరి, జనవరి 13 : మండలంలోని టాక్లీ గ్రామంలో ఉన్న ఎస్సీకాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నదని, మూడు నెలల నుంచి విన్నవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని టాక్లీ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎస్సీ కాలనీవాసులు రెండు ఆటోల్లో కోటగిరి మండల కేంద్రానికి చేరుకొని బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అధికారులు నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాంబ్లే జ్యోతిపాల్, ప్రకాశ్, ఆవ్‌సాజీ, గంగారాం, నాగాబాయి, సావిత్రీబాయి, రాజాబాయి పాల్గొన్నారు.

కోటగిరి బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న టాక్లీ గ్రామస్తులు

ఘనంగా భోగి.. పలుచోట్ల ముగ్గుల పోటీలు

నమస్తేతెలంగాణ యంత్రాంగం, జనవరి13 : జిల్లావ్యాప్తంగా భోగి వేడుకలు సోమవారం ఉదయం ప్రజలు సంతోషంగా జరుపుకొన్నారు. భోగి మంటలు వేసి, వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ సందడి చేశారు.

బోధన్‌లో భోగిమంటలు

ధర్మారంలో భోగిమంటలు

ధర్మారంలో ముగ్గులు వేస్తున్న యువతులు

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు

యథేచ్ఛగా చైనా మాంజా విక్రయాలు

- తూతూ మంత్రంగా అధికారుల తనిఖీలు

వినాయక్‌నగర్, జనవరి 13 : ప్రాణాంతకమైన చైనా మాంజాను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇటు పోలీసు యంత్రాంగంతోపాటు అటు ఫారెస్టు అధికారులకు చైనా మాంజా విక్రయాలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకునేందుకు పూర్తి అధికారాలు ఇచ్చారు. అయినా జిల్లా కేంద్రంలో మాత్రం పతంగుల దుకాణాల నిర్వాహకులు మాత్రం యథేచ్ఛగా చైనా మాంజా విక్రయాలు జరుపుతున్నారు. ఇన్‌చార్జి సీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఏసీపీ ఆధ్వర్యంలో సీసీఎస్ సీఐ సిబ్బందితో కలిసి రెండు మూడు సార్లు పెద్దబజార్‌లోని కొన్ని పతంగుల దుకాణాలపై దాడులు నిర్వహించి, చైనా మాంజా విక్రయిస్తున్న కొంతమందిని అదుపులోకి తీసుకొని రెండోటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కానీ అన్ని దుకాణాల్లో చైనా మాంజా విక్రయిస్తున్నట్లు తెలుస్తున్నది.

గోదాముల్లో నిల్వ.. ప్రతిరోజూ విక్రయాలు

చైనా మాంజా బెండల్ రూ.2 వేలకు విక్రయిస్తూ పతంగుల దుకాణాల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు మాత్రం అధికారుల ఆదేశాల మేరకు తూతూ మంత్రంగా తనిఖీలు చేపడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శనివారం పెద్దబజార్‌లోని పలు షాపుల వద్దకు పోలీస్, అటవీ శాఖ అధికారులు వచ్చి, నామమాత్రపు తనిఖీలు చేపట్టారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చైనా మాంజాను కొనుగోలు చేసేందుకు వచ్చిన వారి నుంచి డబ్బులను షాపులో తీసుకొని, పక్కగల్లీలోని గోదాములో తమ వ్యక్తులతో కొనుగోలుదారులకు మాంజాను ఇప్పిస్తున్నారు. ఈ విషయం సామాన్యుడికి తెలిసినా పోలీసులు, ఫారెస్టు అధికారులకు ఎందుకు తెలియకుండా ఉంటుందన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు చైనా మాంజాను విక్రయించడాన్ని అరికట్టడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పతంగుల షపులో దాడులు నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

జిల్లాప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

కంఠేశ్వర్/ ధర్పల్లి, జనవరి 13 : జిల్లాప్రజలకు అధికారులు ప్రజాప్రతినిధులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటనలు విడుదల చేశారు. భోగ భాగ్యాలనిచ్చే భోగి, సరదాలు పంచే సంక్రాంతి వేడుక ప్రజలందరికీ ఆనందం పంచాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆకాంక్షించారు. ఏడాదంతా శుభాలు సమకూరాలని ఇంటింటా సిరుల కాంతులు విలసిల్లాలని అభిలాషించారు. రూరల్ నియోజకవర్గ ప్రజలకు బీఆర్ఎస్ నాయకుడు, ధర్పల్లి మాజీ జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

- ఆటోల్లో అదనపు సీట్ల తొలగింపు

ఆటోల్లోని అదనపు సీట్లను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

వినాయక్‌నగర్, జనవరి 13 : నగరంలోని బోధన్ బస్టాండ్ ప్రాంతంలో స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను కూర్చోబెట్టుకోవద్దని, ఆటోల్లో సౌండ్ బాక్సులు, అదనపు సీట్లు ఉంచవద్దని సూచించారు. అనంతరం 20 ఆటోల్లో డ్రైవర్ల పక్కన అమర్చిన అదనపు సీట్లను తొలగించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై చంద్రమోహన్, రహమతుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

చైనా మాంజాతో బాలుడికి గాయాలు

మోర్తాడ్, జనవరి 13:చైనా మంజా ఓ బాలుడ్ని తీవ్రంగా గాయపరిచింది. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కమ్మర్‌పల్లికి చెందిన బాలుడు రఘు (3) సోమవారం ఇంటి ముందర ఆడుకుంటున్నాడు. అయితే, ఎవరో ఎగురవేసిన గాలిపటం తెగిపోయింది. దానికి వినియోగించిన చైనా మాంజా బాలుడి గొంతుకు తగలడంతో గాయమైంది. రఘును దవాఖానకు తరలించిన కుటుంబ సభ్యులు.. పోలీసులకు సమాచారమిచ్చారు.

చైనా మాంజా అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు

కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన కావలి యాదగిరి తన షాపులో తెలంగాణ ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను సోమవారం అమ్ముతుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. కమ్మర్‌పల్లిలో చైనా మాంజా కారణంగా రఘు అనే బాలుడు గాయాలపాలు కావడంతో స్పందించిన పోలీసులు చైనా మాంజా అమ్ముతున్న వారి గురించి వాకబు చేశారు. చైనా మాంజా అమ్ముతున్న యాదగిరిపై కేసు నమోదు చేశారు.

సంక్షిప్తంగా..

- **పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ** - పొతంగల్, జనవరి 13 : మండలంలోని హంగర్గాఫారంలో గ్రామ పంచాయతీ కార్మికులకు మాజీ సర్పంచ్ ఎజాజ్‌ఖాన్, నాయకుడు సజ్జద్ సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. నాయకులు బాపురావు, కిషన్ నాయక్, నాగు పాల్గొన్నారు.
- **ధర్మ సమాజ్ పార్టీ మండల కార్యవర్గం ఎన్నిక** - డిచ్‌పల్లి, జనవరి 13: ధర్మసమాజ్ పార్టీ (డీఎస్‌పీ) మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు మహిపాల్ మహరాజ్ తెలిపారు. అధ్యక్షుడిగా ఉగ్గెర పోచయ్య, ఉపాధ్యక్షులుగా సురేష్, సాయిలు, ప్రధాన కార్యదర్శులుగా మోహన్, దాసు, కార్యదర్శులుగా సాగర్, రాకేశ్, భూషణ్, సాయిలు, కార్యవర్గ సభ్యులుగా మహేశ్, నరేందర్, శ్రీనివాస్, గంగారాం, నర్సయ్య, కుమార్‌ను ఎన్నుకున్నట్లు వివరించారు.
- **జీజీహెచ్‌లో మెరుగైన వైద్యమందించాలి** - సిరికొండ, జనవరి 13 : జిల్లా ప్రభుత్వ దవాఖానలో వసతులు కల్పించి, మెరుగైన వైద్యమందించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు అనీష్ డిమాండ్ చేశారు. మండలంలోని గడ్కోల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీజీహెచ్‌వో రోగులకు వైద్యసేవలందించకుండా వైద్యులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, సూపరింటెండెంట్ వేడుకలు దవాఖానలోనే ఘనంగా నిర్వహించడం ఇందుకు నిదర్శనమన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు అరుణ్, మహి పాల్గొన్నారు.
- **చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు** - ధర్పల్లి, జనవరి 13 : చైనా మంజాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రాణాంతకంగా మారిన చైనా మాంజాను ప్రభుత్వం నిషేధించిందని, దాన్ని విక్రయించిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రుద్రూర్, జనవరి 13 : మండల కేంద్రంలోని జేఎన్సీ కాలనీలో సఫీయా బేగం ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రుద్రూర్ ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రూర్‌కు చెందిన సఫీయా బేగం స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో కాంట్రాక్ట్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నది. సంక్రాంతి సెలవులు ఉండడంతో సఫియా బేగం తన కూతురితో కలిసి శనివారం హైదరాబాద్‌లోని తన అన్న ఇంటికి వెళ్లింది. సఫియా బేగం ఇంట్లో చోరీ జరిగినట్లు ఆ ఇంటి పనిమనిషి పోతురాజు లింగయ్య సోమవారం ఉదయం గుర్తించి, ఫోన్ ద్వారా ఆమెకు సమాచారం అందించాడు. ఆమె ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి, బీరువా తాళం పగులగొట్టి ఉండడం, బీరువాలో దాచిన నాలుగు గ్రాముల బంగారు కమ్మలు, 30 తులాల వెండి పట్టగొలుసులు చోరీకి గురైనట్లు బాధితురాలు తెలిపింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రుద్రూర్ ఎస్సై సాయన్న ఘటనా స్థలానికి చేరుకొని, ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు, ఆర్టీసీ బస్సు ఢీ : తప్పిన పెనుప్రమాదం

డిచ్‌పల్లి, జనవరి 13 : కారు టైరు పేలడంతో కారు, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటన మండలంలోని నడిపల్లి గ్రామశివారులో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. ఈప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతోపాటు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు నడిపల్లి శివారులోకి రాగానే ముందు టైరు పేలడంతో డివైడర్‌ను ఢీకొట్టి, ఒక్కసారిగా వెనక్కి తిరిగింది. అదే సమయంలో కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న బస్సు కారును ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో కారులో ఉన్న వారికి ప్రమాదం తప్పింది. బస్సులో ఉన్న సుమారు 60 మంది ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ ప్రమాదంలో కారుతోపాటు బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. కారు, బస్సు రోడ్డుపై నిలిచిపోవడంతో కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న డిచ్‌పల్లి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని, ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తీయించి, రాకపోకలను పునరుద్ధరించారు. కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నటట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్‌లో గోల్డ్ మెడల్

కీర్తనను సన్మానిస్తున్న గ్రామస్తులు

మాక్లూర్, జనవరి 13: మండలంలోని ఒడ్యాట్‌పల్లి గ్రామానికి చెందిన దుడ్డు కీర్తన ఇండియన్ నేషనల్ గేమ్స్ జమ్ముకశ్మీర్‌లో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. ఆదివారం రాత్రి గ్రామానికి వచ్చిన సందర్భంగా ఆమెను గ్రామపెద్దలు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, మాజీ సర్పంచ్ ప్రవీణ్, ఒడ్డెటమ్మ ఆలయ మాజీ చైర్మన్ సత్యం, గ్రామకమిటీ సభ్యులు సన్మానించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కీర్తన తల్లిదండ్రులు దుడ్డు గంగాధర్, సునీత తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ అండ

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల

మోర్తాడ్, జనవరి 13: బీఆర్ఎస్ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామానికి చెందిన మహిళాకార్యకర్త ఆకుల లావణ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బీఆర్ఎస్ సభ్యత్వ ప్రమాద బీమా ద్వారా మంజూరైన రూ.2లక్షల చెక్కును సోమవారం ఎమ్మెల్యే స్వగృహంలో లావణ్య భర్త లింగన్నకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విద్యాసాయి గంగారెడ్డి, మహేశ్, బాశెట్టి గంగాధర్, ప్రశాంత్, దేవేందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల

నిమ్స్‌లో చికిత్స కోసం వేముల భరోసా

న్యూరో చికిత్స కోసం నిమ్స్‌లో చేరిన మెండోరా మండలం కొడిచెర్ల గ్రామానికి చెందిన దశరథ్‌కు మెరుగైన చికిత్స కోసం మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి భరోసా కల్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు బాల్కొండ క్యాంపు కార్యాలయంలో రూ.2లక్షల ఎల్‌వోసీ కాపీని అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్, పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రవీందర్‌గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గంగారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ కల్యాణ మండపం ప్రారంభం

మెండోరా జనవరి 13: మండల కేంద్రంలో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆలయ కమిటీ, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించి స్వామివారి జ్ఞాపికను అందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. ఒకరి దుర్మరణం

శ్రీనివాస్(ఫైల్)

బాల్కొండ, జనవరి 13: 44వ నంబర్ జాతీయ రహదారిపై జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై నుంచి పడిన వ్యక్తిని వాహనం 10 మీటర్లు లాక్కెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని చిట్టాపూర్‌లో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. బత్తుల శ్రీనివాస్ (42) భవన నిర్మాణ మేస్త్రీగా పదేండ్ల క్రితం నిర్మల్ జిల్లా సోన్ మండలం బొప్పారం గ్రామానికి వచ్చాడు. స్వస్థలం ఒంగోలు జిల్లా కొండెపు మండలం ధర్మవరం గ్రామం. మృతుడికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. తన సమీప బంధువును ద్విచక్ర వాహనంపై పెర్కిట్‌లో వదిలి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి పది మీటర్ల దూరం వరకు లాక్కెళ్లింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్, జనవరి13: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ సత్యనారాయణ గౌడ్ కథనం ప్రకారం.. నిజామాబాద్ హబీబ్‌నగర్‌కు చెందిన మహ్మద్ మద్యానికి బానిసయ్యాడు. పట్టణంలోని జర్నలిస్టు కాలనీకి తనతల్లి దగ్గరికి వచ్చి వెళ్తుండేవాడు. 15 రోజుల నుంచి కనిపించడం లేదు. పెర్కిట్ శివారులో చెట్టుకు ఉరేసుకొని మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయంలో చోరీ

ఆర్మూర్‌టౌన్, జనవరి 13: పట్టణంలోని శ్రీ నవనాథ సిద్ధులగుట్టపై ఉన్న ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. నవనాథ సిద్ధేశ్వర ఆలయంలోని హుండీని పగులగొట్టి డబ్బులు, ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు ఆలయ అర్చకుడు కుమార్ శర్మ తెలిపారు. అయ్యప్ప స్వామి ఆలయం హుండీని పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలకు భౌతికకాయం అప్పగింత

ఖలీల్‌వాడి, జనవరి 13 : సీపీఐఎంఎల్ ప్రజాపంథ రాష్ట్ర నాయకుడు, జిల్లా మాజీ కార్యదర్శి కర్నాటి యాదగిరి సతీమణి అనసూయ (78) క్యాన్సర్‌తో సోమవారం ఉదయం కోటగల్లీలో మృతిచెందారు. ఆమె భౌతిక కాయానికి సీపీఐఎంఎల్ నాయకులు ఎన్‌భవన్‌లో నివాళులర్పించారు. ఆమె కండ్లను లయన్స్‌క్లబ్ వారికి, శరీరాన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు కుటుంబీకులు అందజేశారు.

త్రివేణి సంగమ క్షేత్రం వద్ద జడ్జి పూజలు

రెంజల్, జనవరి 13: సంక్రాంతి పౌర్ణమిని పురస్కరించుకొని కందకుర్తి వద్ద గోదావరి త్రివేణి సంగమ క్షేత్రంలో బోధన్ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శివసాయి కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. నదిలో దీపాలు వెలించి మొక్కులు చెల్లించుకున్నారు. నది ఒడ్డున ఉన్న శివాలయంలో పూజలు నిర్వహించారు. కుంభ మేళా ప్రారంభం కావడంతో గోదావరి నది వద్ద భక్తులు పూజలు నిర్వహించారు.

నదిలో పూజలు నిర్వహిస్తున్న జడ్జి, కుటుంబ సభ్యులు

కేంద్ర సాహిత్య పురస్కారం అందుకున్న రమేశ్ కార్తీక్‌నాయక్

ఖలీల్‌వాడి / సుభాష్‌నగర్ జనవరి 13 : జిల్లాకు చెందిన రమేశ్ కార్తీక్ నాయక్ కేంద్ర సాహిత్య పురస్కారాన్ని సోమవారం అందుకున్నారు. తన తొలికథల సంపుటి ఢావ్లో– గోర్ బంజారా కథలు పుస్తకంలో తెలుగు రాష్ట్రాల్లోని గోర్ బంజారాల గిరిజన సంచార తెగల జీవన శైలికి అద్దం పట్టిన కథలు, బంజారాల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు, లోతైన సున్నితత్వాన్ని తెలియజేసినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ పురస్కారం అందుకున్న తొలి గిరిజన యువ రచయితగా రమేశ్ కార్తీక్ నాయక్ నిలిచారు. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో ఉన్న ఉత్కల్ విశ్వవిద్యాలయంలో 2024 సంవత్సరానికి గాను సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ కౌశిక్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. గతంలో హరిదా సరస్వతీ రాజ్ యువ పురస్కారాన్ని అందుకున్న రమేశ్ కార్తీక్ నాయక్.. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకోవడంపై జిల్లా కవులు, రచయితలు గణపురం దేవేందర్, క్యాతం సంతోష్ కుమార్, నరాల సుధాకర్, పంచరెడ్డి లక్ష్మణ్, కాసర్ల నరేశ్‌రావు, గంట్యాల ప్రసాద్, తిరుమల శ్రీనివాస్ ఆర్య, ముద్దుకూరి సాయిబాబు తదితరులు అభినందనలు తెలిపారు.

పురస్కారం అందుకుంటున్న రమేశ్ కార్తీక్ నాయక్

కుంభమేళాలో ఇడ్లీ, సాంబార్ పంపిణీ

ఇడ్లీ, సాంబార్ వడ్డిస్తున్న మంగిరాములు మహరాజ్

నందిపేట్, జనవరి 13: ఉత్తరప్రదేశ్‌లో కొనసాగుతున్న ప్రయాగ మహా కుంభమేళాలో మండల కేంద్రంలోని కేదారేశ్వర ఆశ్రమం పలుగుట్ట తరపున ఇడ్లీ సాంబార్ అందిస్తున్నారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహరాజ్ తన భక్తబృందంతో కలిసి మూడు రోజుల ముందుగానే అక్కడికి చేరుకుని సోమవారం నుంచి ప్రారంభమయ్యే మహాకుంభమేళాలో ఇడ్లీ, సాంబార్ వడ్డించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. 12 రోజుల పాటు భక్తులకు ఇడ్లీ, సాంబార్ అందించనున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

బోధన్, జనవరి 13: బోధన్ మున్సిపాలిటీ 14, 26వ వార్డుల్లో పనిచేసే మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు 14వ వార్డు కౌన్సిలర్ కామేపల్లి నాగవర్ధిని భర్త, మాజీ కౌన్సిలర్ కేవీ సత్యనారాయణ (సత్యం) సంక్రాంతి సందర్భంగా దుస్తులు పంపిణీచేశారు. ఈ రెండు వార్డుల్లో పనిచేసే 27 మంది కార్మికులకు వీటిని అందించారు. తన తల్లి జ్ఞాపకార్థం దుస్తులు పంపిణీచేసినట్లు సత్యం తెలిపారు. మాజీ కౌన్సిలర్ అంకు దామోదర్ (దాము) పాల్గొన్నారు.

వైభవంగా గోదా రంగనాథుల కల్యాణం

జెండా బాలాజీ ఆలయంలో నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్న భక్తులు

డిచ్‌పల్లి/ సుభాష్‌నగర్/ మోపాల్ (ఖలీల్‌వాడి)/బాల్కొండ/నందిపేట్, జనవరి 13 : ధనుర్మాస ముగింపు సందర్భంగా జిల్లాలోని వైష్ణవాలయాల్లో సోమవారం గోదాదేవీ రంగనాథ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బీ) గ్రామంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించారు. పోలీస్ ఏడో బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ దంపతులు, బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు కుటుంబీకులతో కలిసి పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ రామాలయం, ఖిల్లా రఘునాథాలయం, బ్రహ్మపురి చక్రంగుడి, జెండాగల్లీ జెండా బాలాజీ మందిరం, గంగాస్థాన్ ఫేస్ 2 ఉత్తర తిరుపతి ఆలయాల్లో గోదావేదీ కల్యాణాన్ని నిర్వహించారు. మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఉన్న ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో గోదా రంగనాథ కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్ గ్రామశివారులోని గోదా రంగనాథుని ఆలయంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. నందిపేట్ మండలంలోని ఖుద్వాన్‌పూర్‌లో గోదా రంగనాథ కల్యాణం మహోత్సవంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

ట్రాక్టర్ వేలము ప్రకటన

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి., : పడిగల్, మం॥వేల్పూర్, జి॥ నిజామాబాద్

(యస్.సి.డి.ఆర్ / ఆఫీసర్ ఆన్‌స్పెషల్ డ్యూటీ ఎన్.డి.సి.సి. బ్యాంక్ లి., నిజామాబాద్ వారి ఉత్తర్వులననుసరించి)

ఇందుమూలముగా తెలియపరుచునది ఏమనగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి., పడగల్, మం॥వేల్పూర్, జి॥నిజామాబాద్‌నకు బాకీ పడిన సొమ్ము మొత్తమును రాబట్టుటకు గాను ఈ దిగువ తెలిపిన తనఖా చేయబడిన ట్రాక్టర్‌ను తెలంగాణ సహకార సంఘాల చట్టంలోని రూలు 52 ప్రకారము బహిరంగ వేలము ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది. కావున సదరు వేలములో పాల్గొనుటకు ఆసక్తిగలవారు ఈ దిగువ తెలుపబడిన షరతులు మరియు నిబంధనలకు లోబడి పాల్గొనగలరు.

బాకీదారుని /తనఖాదారుని తండ్రి / భర్త పేరు	అమ్మబడు తనఖా ట్రాక్టర్ వివరాలు ట్రాక్టర్	నెంబర్		వేలము తేది సమయం స్థలం	ఇ.పి.నెం.బాకీ బడిన సొమ్ము	వేలము నందు పాల్గొనుటకు ధరావత్తు సొమ్ము
శ్రీ బక్కయ్యగారి రాజేశ్వర్ (బాకీదారు) తండ్రి: పెద్ద రాజన్న గ్రా॥ కుకునూర్ మం॥ వేల్పూర్ జి॥ నిజామాబాద్.	Tractor	TS16EP 6863		తేది: 15.01.2025 బుధవారము ఉ॥11-00 గం॥లకు PACS Padagal Society కార్యాలయ ఆవరణలో	ఇ.పి.నెం. 1459/LT/2024-25 రూ॥10,54,967/- అదనంగా (+) వడ్డీ (+) అపరాధపు వడ్డీ (+) తదుపరి కిస్తులు ఉన్నచో వడ్డీతో సహా (+) జప్తు ఖర్చులు (+) ఇతర ఖర్చులు	రూ॥ 10,000/-

షరతులు మరియు నిబంధనలు

1. పైన తెలుపబడిన తనఖా చేయబడిన ట్రాక్టర్‌ని వేలము వేయుటకు అమ్మకపు అధికారికి పూర్తి అధికారము గలదు.
2. వేలము బహిరంగముగా జరుపబడును.
3. ప్రకటనలో తెలిపిన బాకీదారుని ఆస్తి ఏకమొత్తములో వేలము వేయుటకు సేల్ ఆఫీసర్ గారికి అధికారము కలదు.
4. వేలము సమయమునకు ముందుగా బకాయిదారులు గాని అతని ప్రతినిధి గాని బాకీ పడిన సొమ్ము చెల్లించిన యెడల వేలము వాయిదా వేయబడును లేదా రద్దు చేయబడును.
5. వేలము నందు పాల్గొనుటకు ఆసక్తి గలవారు ధరావత్తు సొమ్మును ముందుగా అమ్మకపు అధికారికి గాని సంఘ కార్యదర్శికి గాని డిడి లేదా నగదు రూపేణా స్వయంగా లేదా ప్రతినిధి ద్వారా చెల్లించి రశీదు పొందగలరు. సదరు వేలము వాయిదా బడిన లేదా రద్దు అయినచో సదరు వ్యక్తి ఏ కారణముచేనైనా వేలములో పాల్గొనుటకు ఇష్టపడని యెడల ఇట్టి ధరావత్తు సొమ్ము వాపసు చేయబడును.
6. ధరావత్తు సొమ్ము చెల్లించిన వారు మాత్రమే వేలములో పాల్గొనుటకు అర్హులు.
7. సదరు వేలమునందు అధిక ధర పాట పాడిన వారికి ట్రాక్టర్ (ఉన్నది ఉన్నట్లుగా) అప్పగించుటకు సేల్ ఆఫీసర్ గారికి అధికారము గలదు. వేలము తేది నుండి (30 రోజుల) తరువాత సేల్ సర్టిఫికెట్ ఇవ్వబడును.
8. సదరు వేలములో అధికముగా వేలం పాట పాడిన వ్యక్తి వేలం పాటపాడిన కొనుగోలు సొమ్ము మొత్తములో 15శాతం సొమ్ము తక్షణమే డిపాజిట్ చేయవలెను. మిగతా సొమ్మును 15 రోజుల గడువు లోపుగా చెల్లించవలెను. గడువులోగా పూర్తి సొమ్మును కొనుగోలుదారు చెల్లించని యెడల 15% డిపాజిట్ సొమ్మును వేలం పాటదారుడు కోల్పోగలడు. మరియు ట్రాక్టర్ ఆస్తి తిరిగి వేలం వేయబడును. తిరిగి వేలము వేయుటకు అగు ఖర్చును మొదటి కొనుగోలుదారు భరించవలెను.
9. స్టాంపు డ్యూటీ రిజిస్ట్రేషన్ మరియు ఇతర చార్జీలు కొనుగోలుదారుడే భరించవలెను.
10. వేలం పాట పాడిన ధర అనుచితముగా లేదా తక్కువగా ఉన్న యెడలగాని లేదా ఇతర కారణముల వలన గాని హెచ్చువేలం పాటను అమ్మకపు అధికారి తిరస్కరించవచ్చును.
11. డిక్రీ హోల్డర్ అయిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి., పడగల్ వేలములో పాల్గొనుటకు మరియు సెట్ ఆఫ్ చేసుకొనుటకు అర్హత కలదు.
12. వేలము నడపుటకు, ఖాయపరుచుటకు, వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు అమ్మకపు అధికారికి పూర్తి స్వేచ్ఛ కలదు.

తేది: 01-12-2024
నిజామాబాద్.

సం/- మేనేజర్ / అమ్మకపు అధికారి
ది.నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి., నిజామాబాద్